బస్సుకు నోచుకోని శివారు కాలనీలు

- ప్రధాన రూట్లకే ఆర్టీసీ బస్సులు పరిమితం
- కాలనీల నుంచి మెయిన్ రోడ్డు వరకు ఆటోలే దిక్కు
- కాలనీ వాసుల ఇబ్బందులు పట్టని ఆర్టీసీ అధికారులు



శివారు కాలనీలకు వెళ్లే వారి కోసం వనస్థలిపురం గణేష్ టెంపుల్ వద్ద వేచి ఉన్న ఆటోలు

వనస్థలిపురం: నగర శివారు ప్రాంతాల్లో కొత్త కాలనీలు శరవేగంగా రూపుదిద్దుకుంటుండగా అందుకు తగ్గట్టుగా రవాణా సదుపాయం లేకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టీసీ బస్సులు ప్రధాన రూట్లకే పరిమితం అవుతున్నాయి. దీంతో కాలనీల్లో నివాసం ఉండే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం నగరానికి వెళ్లేవారు ప్రధాన రహదారుల వరకు వెళ్లడానికి, తిరిగి ఇళ్లకు చేరుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. వ్యక్తిగత వాహనాల లేని వారు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. శివారు కాలనీలకు మినీ బస్సులు నడుపుతామన్న ప్రజాప్రతినిధుల మాటలు అమలుకు నోచుకోవడం లేదని కాలనీల ప్రజలు వాపోతున్నారు.

- నగరం నుంచి వచ్చే బస్సులు విజయవాడ జాతీయ రహదారిలో పనామా చౌరస్తా నుంచి వనస్థలిపురం గణేష్ టెంపుల్, రైతు బజారుల మీదుగా ఒక్క హయత్‌నగర్ వైపు మాత్రమే వెళ్తున్నాయి.
- నగరం నుంచి వచ్చే చాలా బస్సులు వనస్థలిపురం ఎన్జీఓస్‌కాలనీ బస్టాండ్ వరకు మాత్రమే వచ్చి.. అక్కడి నుంచి తిరిగి వెళ్తున్నాయి.
- విజయవాడ జాతీయ రహదారి పనామా చౌరస్తా నుంచి గానీ, సుష్మ చౌరస్తా నుంచి గానీ, భాగ్యలతా చౌరస్తా నుంచి గానీ సాహెబ్‌నగర్, దాని పరిసర కాలనీలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు.



బస్సుల్లో నగరానికి వెళ్లే వారు గణేష్ టెంపుల్ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

- నాగార్జునసాగర్ రహదారిలో బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా నుంచి సాహెబ్‌నగర్, పరిసర కాలనీలకు వెళ్లడానికి ఎలాంటి బస్సు సౌకర్యం లేదు.
- బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం తూర్పు కాలనీలు, హయత్‌నగర్‌కు వెళ్లడానికి కూడా బస్సు సౌకర్యం లేదు.
- బీఎన్‌రెడ్డినగర్ బీడీరెడ్డి గార్డెన్ నుంచి అల్మాస్‌గూడ, మీర్‌పేట, బడంగ్‌పేట తదితర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తోంది.
- సాహెబ్‌నగర్, గాయత్రినగర్ పరిసర 20 కాలనీల ప్రజలు వనస్థలిపురం రైతుబజార్, బ్యాంకులు, ఇతర అవసరాలకోసం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్, నాగార్జున సాగర్ రోడ్డుకు చేరుకోవాలంటే ఆటోలే దిక్కు.
- వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌ల నుంచి శివారు కాలనీలకు వెళ్లడానికి ఆటోలకు రూ. 100 నుంచి 150 చెల్లించాల్సి వస్తోంది.

ఇక రాత్రి వేళ అయితే ఆటోవాలాలు ఎంత అడిగితే అంత చెల్లించుకోవాల్సిందే.

- ద్విచక్ర వాహనాలు ఉన్నవారు తమ కాలనీల నుంచి ఎన్జీఓస్‌కాలనీ బస్టాండ్, వనస్థలిపురం గణేష్ టెంపుల్ ప్రాంతాలకు వస్తున్నారు. అక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేసి అక్కడి నుంచి బస్సుల్లో నగరానికి వెళ్తుంటారు. విధులు, పనులు ముగిసిన తర్వాత మళ్లీ బస్సుల్లో వచ్చి పార్క్ చేసిన వాహనాలను తీసుకుని కాలనీలకు వెళ్తుంటారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



సాగర్ రోడ్డు బీఎన్‌రెడ్డినగర్ నుంచి, విజయవాడ జాతీయ రహదారి నుంచి వనస్థలిపురం తూర్పు కాలనీలు, సాహెబ్‌నగర్, పరిసర కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలి. శివారు కాలనీలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలకు అధిక చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తోంది. సరైన రవాణా సౌకర్యం లేక మహిళలు, విద్యార్థినులు, సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఉదయం, సాయంత్రం వేళల్లోనైనా కాలనీలకు బస్సులు నడపాలి.

– జి.మాధవి, గాయత్రినగర్ కాలనీ, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు తప్పదు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి. చిత్రంలో లక్ష్మారెడ్డి

లింగోజిగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే ప్రజలకు నీటి, కరెంట్ కష్టాలను తీసుకొచ్చిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ లింగోజిగూడ, చంపాపేట, హస్తినాపురం డివిజన్ల ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ తాత్సారం చేస్తోందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు తప్పదని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ఇతర పార్టీల వారు స్థానికులు కారని, స్థానికుడైన లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని సుధీర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, పద్మానాయక్, డివిజన్ల అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి, సత్యంచారి, కృష్ణామాచారి, రాజిరెడ్డి, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కలిసి కట్టుగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని అందరం కలిసి కట్టుగా గెలిపించుకోవాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో దర్పల్లి మాట్లాడుతూ, బూత్ స్థాయిలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించాలని, ప్రజలకు కాంగ్రెస్ అందజేస్తున్న పథకాలను స్థానిక నాయకులు ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలు పత్యక్షంగా, సామాజిక మధ్యమాల్లో చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎల్‌బీనగర్‌లో పార్టీ మరింత పటిష్టంగా మారిందన్నారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం తథ్యమని అన్నారు. సమావేశంలో కందికంటి శ్రీధర్‌గౌడ్, పి.శ్రీధర్‌గౌడ్, మల్కాజిగిరి దయానంద్, పన్యాల జైపాల్‌రెడ్డి, రాజేశ్వరి, సుధీర్‌రెడ్డి, రాచకొండ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేద్దాం

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



విలేకరులతో మాట్లాడుతున్న అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్లలో జరిగే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ హక్కుల కోసం పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు కొట్లాడతారని, మన సమస్యలు పరిష్కారం కావాలంటే పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలని కోరారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గెలుపును చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, ప్రతి ఒక్కరూ గెలుపు కోసం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు నెలకొండ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, శ్రీమన్నారాయణ, దుబ్బాక శేఖర్, రమేష్, పాషా, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేసిన అభివృద్ధే లక్ష్మారెడ్డిని గెలిపిస్తాయి



సమావేశంలో పాల్గొన్న సత్యంచారి, బీఆర్ఎస్ నాయకులు

హస్తినాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆందోజు సత్యం చారి అన్నారు. హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో సత్యంచారి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అధిక మెజార్టీ లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్, గోదల రఘుమారెడ్డి, రమావత్ శ్రీనివాస్‌నాయక్. రెడ్డిమాల పెద్దకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం

పహాడీషరీఫ్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్ అన్నారు. చేవెళ్లలో శనివారం నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. షాహిన్‌నగర్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. షర్ఫుద్దీన్ హమీద్ మాట్లాడుతూ, లోక్‌సభలో రాష్ట్ర గళాన్ని వినిపించేది కేవలం బీఆర్ఎస్ ఎంపీలే అని పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో బరిలో ఉన్న బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతున్న ఈ సభకు భారీగా వెళ్లేందుకు అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

మినీ బస్సులను ఏర్పాటు చేయాలని వినతి

బడంగ్‌పేట్: మినీ బస్సులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మహేశ్వరం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రిని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలుసుకొని శాలువ కప్పి సన్మానించారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజు రోజుకూ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో మినీ బస్సుల ప్రాధాన్యతను వివరించారు. అల్మాస్‌గూడలో కాలనీల మీ దుగా మినీ బస్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకో వాలని మంత్రికి విజ్ఞప్తి చేశా రు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం జనాభా ఎక్కువగా ఉన్న కాలనీల మీదుగా బస్సులు తిరిగేలా రూట్ మ్యాప్ తయారు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారని రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 32, బీర 35, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 21, క్యారెట్ 28, దొండ 18, ఆలు 31, ఉల్లి 21, గోకర 35, దోస 15, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్ రూట్ 21, కీర 20, ఫ్రెంచ్ బీన్స్ 60, కాప్సికమ్ 65. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మర్యాదపూర్వక కలయిక



సైదాబాద్: టీపీసీసీ కార్యదర్శి, ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు కోట్ల శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తామన్నారు.

బీజేపీ ధార్మిక పరిషత్ జాయింట్ కన్వీనర్ సభ్యుడిగా చక్రవర్తి



దిల్‌సుఖ్‌నగర్: భారతీయ జనతా పార్టీ ధార్మిక పరిషత్ తెలంగాణ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్ సభ్యుడిగా రామకృష్ణాపురానికి చెందిన దేవి ఉపాసకుడు బ్రహ్మశ్రీ నారాయణం చక్రవర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు బీజేపీ కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్, కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావులు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ, త్రికరణ శుద్ధితో తను బాధ్యతలను నిర్వర్తిస్తానని అన్నారు.

14న అంబేడ్కర్ శోభాయాత్ర



శోభాయాత్ర వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నాగోలు: అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న ఎల్‌బీనగర్ నుంచి కొత్తపేట చౌరస్తా వరకు అంబేడ్కర్ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు కామన్ మ్యాన్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ చైర్మన్ సంఘటి ప్రసాద్ తెలిపారు. ఎల్‌బీనగర్‌లో అంబేడ్కర్ శోభాయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంఘాలు, అంబేడ్కర్ వాదులు, బహుజన వాదులు అందరూ కలిసి చేసుకునే ఒక అద్భుతమైన పండుగ అంబేడ్కర్ జయంతి అని అన్నారు. ఈ సందర్భంగా ఈనెల 14న సాయంత్రం 6.30 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎల్‌బీనగర్ నుంచి కొత్తపేట చౌరస్తా వరకు శోభాయాత్రను భారీ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. యాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘అక్షర’ సమ్మర్ నైట్‌క్యాంప్



నైట్ క్యాంప్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు

హస్తినాపురం: విద్యార్థుల మధ్య స్నేహభావం, సమతుల్యత పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా సమ్మర్ నైట్ క్యాంప్ నిర్వహించామని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ సీఈఓ మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్‌బీనగర్‌లోని అక్షర ఇంటర్నేషనల్ విద్యాసంస్థలో సమ్మర్ నైట్ క్యాంప్ ఉత్సాహంగా..ఉల్లాసంగా సాగింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని మదన్‌మోహన్‌రావు అన్నారు. సంవత్సరం పొడవునా పరీక్షలు, తరగతులతో గడిపిన విద్యార్థులకు ఈ సమ్మర్ నైట్ క్యాంప్ ఒక రిలీఫ్ ఇచ్చింది. పాఠశాలలో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా గడపడం వల్ల వారి మధ్య ఒక స్నేహబంధం ఏర్పడింది. విద్యార్థుల సంగీత, సాహిత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణి వారణాసి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో రాయపోల్, దండు మైలారం గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు మైబెల్లి, నాగరాజు, కృష్ణారెడ్డి, ఏఎస్ఐలు రత్నయ్య, జలంధర్, సీఐఎస్ఎఫ్ , స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత



చీరలను పంపిణీ చేస్తున్న సుజాత

కాచిగూడ: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించాలని తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. వీబీజీ ఫౌండేషన్ వనితా విభాగ్ ఫౌండర్ మడిపడిగె సత్యవతి ప్రసన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం మహిళలకు చీరలు, కుట్టు మిషన్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనాథ ఆశ్రమాల్లో నిత్యావసర వస్తువులు, వృద్ధాశ్రమాల్లో దుస్తులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుటుందని అన్నారు. ప్రతి మహిళ విద్యను అభ్యసించాలని సూచించారు. సత్యవతి ప్రసన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని కోరారు. శత చిత్రాల నిర్మాత తుమ్మల పల్లి రామసత్యనారాయణ, ప్రొడ్యూసర్ డీఎస్. రావు, వీబీజీ ఫౌండేషన్ ఫౌండర్ మడిపడిగ రాజు, సంతోష్, విశ్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూవైజ్ఞానిక శాస్త్రవేత్తలకు ముగిసిన శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 47వ బ్యాచ్ శాస్త్రవేత్తలు

మన్సురాబాద్: క్రమశిక్షణ, అంకితభావంతో విద్యార్థి దశనుంచి ప్రొఫెషనల్ జియాలజిస్ట్‌గా విజయవంతంగా పూర్తి చేసిన అధికారులందరూ భవిష్యత్‌లో తమ విధులను సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (హెడ్ మిషన్-5) డాక్టర్ మాథ్యూజోసెఫ్ అన్నారు. శుక్రవారం భారతీయ భూ వైజ్ఞానిక సర్వే శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ) ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియామకమైన 47వ బ్యాచ్ భూ వైజ్ఞానిక శాస్త్రవేత్తల ఓరియంటేషన్ కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్ అధ్యక్షతన ముగింపు సభ జరిగింది. కోర్సు ముగింపు కార్యక్రమంలో శ్రీశ్యామ ప్రసాద్ భూటియా, డైరెక్టర్ హైదరాబాద్ కోర్సు పూర్తి వివరాలను అందించారు. శిక్షణ పొందిన ట్రైనీ అధికారులందరికీ ఉన్నతాధికారులు సర్టిఫికెట్లు అందజేశారు.

సీతారాముల కల్యాణానికి రండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడలో శ్రీరామభక్త సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి నిర్వాహకులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. నాలుగు దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా 16 రోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిరంజన్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ధన్‌రాజ్‌యాదవ్, క్రాంతియాదవ్, కామాటి మహేష్ తదితరులున్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఇందిరారెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంచడంతో ద్వారా ఎంతో ఉపాధి పొందవచ్చుని వీఎస్ఎన్ రెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి కె.ఇందిరారెడ్డి, మాస్టర్ ట్రైనర్ పృథ్వీరాజ్ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ హరిపురి కాలనీలో వీఎస్ఎన్ రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ స్కూల్లో శాస్త్రీయ పద్ధతిలో తేనె టీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఏడు రోజులపాటు ఈ శిక్షణ కొనసాగుతుందని వారు తెలిపారు. ఎంబీబీ బినేషనల్ బోర్డు ఆర్థిక సహకారం, మేనేజ్ రాజేంద్రనగర్ హైదరాబాద్ వారి ప్రోత్సాహంతో ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వరావు

మలక్‌పేట: సలీంనగర్ ఫ్రెండ్స్ అండ్ షాపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెష్ మండి ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయుక్తంగా ఉంటాయని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల్లో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నీరు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ఎండాకాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మధుకర్, రాజు, సాయిబాబు, కమలాకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఆధ్వర్యంలో ..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి

లింగోజిగూడ: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రధాన చౌరస్తాల్లో జలమండలి ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎల్‌బీనగర్ జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్‌లో జలమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రేం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పహాడీషరీఫ్: మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో సిద్ధి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహిస్తామని నిర్వాహకులు, కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో మహా గణపతి, శివలింగ, నందీశ్వర, పార్వతీ దేవి, మహావిష్ణు, సూర్య భగవానుడు, శిఖర కలశం, ధ్వజ స్తంభం నూతన విగ్రహ ప్రతిష్ఠ చేస్తారన్నారు. ఉదయం ధ్వజారోహణం, నూతన విగ్రహాలకు పంచగవ్య, పంచామృతాలతో అభిషేకం, జలాధివాస హోమం, ఆదివారం యంత్ర విగ్రహాలకు రుద్రాభిషేకం, దేవి హోమం, సోమవారం పుష్యమి నక్షత్ర యుక్త వృషభ లగ్నం, ఉదయం 8.26 గంటలకు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠాపన, వేద పండిత ఆశీర్వాద కార్యక్రమాలుంటాయని తెలిపారు.